జీవనోపాధులు

... భవితవ్యం

డిసెంబర్ 2013

ఎందరో మహానుభావులు...

# ఎస్.ఆర్. శంకరన్



ఎస్.ఆర్.శంకరన్, అత్యంత దయనీయ పరిస్థితుల్లో ఉన్న ప్రజలకు ఎలా సేవ చేయాలనే విషయంలో ఓ ప్రభుత్వ అధికారుల తరం మొత్తానికి ప్రమాణాలు నెలకొల్పారు. ఆయన ధైర్యం, దృఢ సంకల్పం అనేకమంది మానవ హక్కుల కార్యకర్తలకు ప్రేరణగా నిలిచాయి. హింసకు ఆయన ఎంతటి వ్యతిరేకి అయినప్పటికీ, గాంధేయవాదులతో పాటు మావోయిస్టులు కూడా ఆయనను ఎంతో గౌరవించేవారు. పేదరికం, మతం, లైంగిక వివక్ష, వైకల్యంలాంటి వాటి కారణంగా దేశంలో వెనుకబడిపోయిన ప్రజల కోసం ఆయన పడిన తపన, ఆయనను వారికి దగ్గరగా చేసాయి.

ఒక ప్రభుత్వం యొక్క విధి అత్యంత వెనుకబడిన ప్రజల గౌరవాన్ని, హక్కులను, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను పరిరక్షించడమే అని శంకరన్ దృఢంగా విశ్వసించేవారు. ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వం ప్రజల కొరకు ఏం చేయగలదో ఆయన తన కర్తవ్య నిర్వహణ ద్వారా నిరూపించారు. భూసంస్కరణ చట్టాలను రూపొందించడంలో ముఖ్యపాత్ర పోషించిన ఆయన, ప్రభుత్వం వాటిని అమలు చేసేలా పట్టుబట్టారు. గిరిజన ఉపప్రణాళిక, స్పెషల్ కాంపొనెంట్ ప్లాన్ తదితర వాటిని తయారు చేసిన ఆయన, ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో చెప్పుకోదగిన పరిమాణాన్ని షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల కోసం పక్కకు తీసిపెట్టేలా వాటిపై ఒత్తిడి తెచ్చారు. అనేక విధాలుగా వివక్షకు గురైన ప్రజలకు న్యాయం జరిగేందుకు, వారి సంక్షేమం కోసం ఆయన ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. గిరిజన బాలబాలికల కోసం రెసిడెన్షియల్ పాఠశాలలు వాటిలో ఒక ఉదాహరణ. వెట్టి కార్మికులను విడుదల చేయడానికి ఆయన అనేక చట్టాలను కూడా రూపొందించిండంలో సహకరించారు.



ఆయన గురించి అనేక ఆసక్తికరమైన విషయాలు ఉన్నాయి. వాటిలో ఒకటి – శంకరన్ సామాజిక సంక్షేమ కార్యదర్శిగా ఉన్నపుడు తరాల నాటి అప్పులు తీర్చడం కోసం వెట్టి కార్మికులుగా మారిన వారిని విడుదల చేయించడానికి అనేక ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. దీనిపై నాటి అత్యంత శక్తివంతమైన ఒక ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక క్యాబినెట్ సమావేశంలో ఆ ముఖ్యమంత్రి శంకరన్ ప్రభుత్వానికి సమస్యలు సృష్టిస్తున్నారనీ, ఆయన గ్రామగ్రామానికీ తిరుగుతూ, పేద ప్రజలతో ఎలా సమావేశాలు నిర్వహిస్తున్నదీ, వారికి స్వేచ్ఛగా ఉండే హక్కుందని ఎలా వాదిస్తున్నదీ, వెట్టికి వ్యతిరేకంగా ఆయన ప్రజలను ఎలా కూడగడుతున్నదీ వివరించి, ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మృదువుగా మాట్లాడే శంకరన్ తాను తన బాధ్యతను నిర్వర్తిస్తున్నానని ఆయనకు దృఢంగానే బదులిచ్చారు. దీంతో ఆ ముఖ్యమంత్రికి మరింత ఆగ్రహం పెరిగిపోయింది. ఇలాంటి విద్రోహులు తన ప్రభుత్వంలో ఉండతగరని ఆ ముఖ్యమంత్రి ప్రకటించారు. దీనికి బదులుగా శంకరన్ కూడా అలాంటి ప్రభుత్వంలో పని చేయడం తనకూ ఇష్టం లేదని చెప్పి, దీర్ఘకాలిక సెలవు మీద వెళ్లిపోయారు.

శంకరన్‌కున్న మేధోపరమైన సామర్థ్యాలు, పాలనా నిర్వహణా నైపుణ్యాలు, ప్రభుత్వ నియమ నిబంధనలు, ప్రొసీజర్లు, చట్టాలపై ఆయనకున్న పట్టు వల్లే ఆయన ఎన్నడూ, ఎవరికీ వెరవకుండా నిలబడ్డారు. ఏ చట్టంలోని అంశాలనైనా ఆయన నమ్మశక్యం కాని రీతిలో తిరిగి అప్పజెప్పేవారు. శంకరన్ సహచరులు, పై అధికారులు, రాజకీయ నాయకులు, ఆయన సలహాలు, సహాయం కోసం ఆయన మీద ఆధారపడేవారు, ఆయనను విశ్వసించేవారు. ఆయన చెప్పిన విషయాలను ఎలాంటి సందేహం లేకుండా తిరిగి తీసుకునేవారు. తనకు లభించిన పదవులన్నీ ప్రజలు, ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకం, విశ్వాసం కారణంగానే లభించాయని శంకరన్ నమ్మేవారు. ఆ నమ్మకాన్ని అత్యంత పదిలంగా కాపాడుకునేవారు. ఇది ఆయన కేవలం జాతీయ సంస్థలతో చర్చలు జరిపేటప్పుడు మాత్రమే కాదు, అంతర్జాతీయ సంస్థలతో సంప్రదింపులు జరిపేటప్పుడు కూడా ఆయన ఈ విషయాన్ని గుర్తుంచుకునేవారు. ఒకసారి ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఫర్ పవర్‌తో చర్చల సందర్భంగా, రుణం కావాలంటే దాని కోసం ప్రభుత్వం విద్యుత్‌పై ఏ చట్టం చేసే ముందైనా తనను సంప్రదించాలని షరతు విధించింది. దీంతో ఆయన ఆ ఒప్పందంపై సంతకాలు చేయడానికి నిరాకరించారు. ఆ సంస్థ ఆ నిబంధనను తొలగించాకే ఆయన దానిపై సంతకాలు చేశారు. ఒకసారి భారత ప్రభుత్వ కార్యదర్శిగా ఉన్న ఆయనను చూడడానికి ప్రపంచ బ్యాంక్ టీమ్ ముందస్తు అనుమతి లేకుండా రావడంతో ఆయన, వారిని కలవడానికి నిరాకరించారు. వారిని కలుసుకోవాలని పై అధికారులు సూచించగా దానికాయన,“ ఒక భారతీయ అధికారి ముందస్తు అనుమతి లేకుండా ప్రపంచ బ్యాంక్ కార్యాలయంలోనికి వెళ్లగలడా?” అని వారికి బదులిచ్చారు.

ఒకసారి భారత సైన్యం ముందస్తు సమాచారం లేకుండా త్రిపురలోనికి ప్రవేశించినపుడు ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన గట్టిగా పట్టుబట్టారు. దీంతో ఆ సైనిక దళాలు వెనుదిరగాల్సి వచ్చింది.

అలాంటి పట్టుదలగల శంకరన్ కార్యాలయంలోకి ఏ సామాన్యుడైనా ఇట్టే ప్రవేశించే సదుపాయముండేది. తనను చూడడానికి వచ్చే ఏ సామాన్యుడు, అమాయకుడినైనా ఎలాంటి అడ్డంకులూ కల్పించకుండా తన వద్దకు పంపాలని శంకరన్ తన కింది సిబ్బందికి గట్టిగా ఆదేశాలు జారీ చేశారు. ఆయన నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా ఉన్నపుడు జరిగిన ఈ విషయాన్ని అనేక మంది గుర్తు చేస్తుంటారు: బాగా పలుకుబడి ఉన్న ఓ వ్యక్తి కలెక్టర్ కోసం వేచి చూస్తూ ఉండగా, ఓ వ్యవసాయ కూలీ రావడం, ఆయనతో మాట్లాడి వెళ్లిపోవడం తటస్థించింది. దీనిపై కినుక వహించిన ఆ వ్యక్తి దీనిపై శంకరన్‌ను సంజాయిషీ కోరారు. దానికాయన, ఆ పలుకుబడి కలిగిన వ్యక్తి వేచి చూస్తే వచ్చే నష్టమేమీ ఉండదనీ, అదే ఆ కూలీ వేచి ఉండాల్సి

వస్తే దాని వల్ల అతనికి ఆ రోజు కూలీ మొత్తం నష్టపోతాడని, దాంతో అతని కుటుంబం మొత్తం పస్తులు ఉండాల్సి వస్తుందని చెప్పి ఆయనను సమాధానపరిచాడని చెబుతారు.

ఇలాంటి సంఘటనలు ఆయన ఉద్యోగంలో, జీవితంలో కోకొల్లలు. దృఢంగా, పట్టుదలతో కన్పించే శంకరన్‌లో అదే స్థాయిలో దయ, సున్నితమైన హృదయం ఉండేవి. ఆయన తాను చేసే ఏ పని పట్లనైనా నిజాయితీతో వ్యవహరించేవాడు. తాను నమ్మింది విశ్వసించే ధైర్యం ఆయనలో ఉండేవి. ఆయన ఈ దృఢ విశ్వాసానికి మూలాలు భారత రాజ్యాంగంలోనూ, దాని సమసమాజ దృక్పథంలోనూ కనిపిస్తాయి. ఒక ప్రభుత్వ సేవకుడిగా భారత రాజ్యాంగ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత తనకుందని ఆయన భావించేవారు. ఆయన తన లక్ష్యాల పట్ల ఎంత స్పష్టంగా ఉండేవారంటే ఎలాంటి రాజకీయ శక్తులు కానీ, స్వార్ధప్రయోజనాలు కానీ వాటిని అడ్డుకోలేకపోయేవి. అలా ప్రయత్నించినా ఆయన వారితో వాదించి, వారిని ఒప్పించి, అవసరమైతే వారితో పోట్లాడి రాజకీయ ప్రయోజనాలు, ఒత్తిళ్లకన్నా రాజ్యాంగపరమైన లక్ష్యాలే తనకు ముఖ్యం అని వారికి స్పష్టం చేసేవారు. మానసిక దృఢత్వం, దాని వెనుక చట్టబద్ధమైన అధికారం ఉంటే ఒక ప్రభుత్వాధికారి ఎలాంటి సామాజిక లక్ష్యాలనైనా సాధించవచ్చని ఆయన నమ్మేవారు. దాదాపు మూడన్నర దశాబ్దాల పాటు ప్రభుత్వ అధికారిగా సేవలందించిన ఆయన, ఉద్యోగ విరమణ అనంతరం ఎలాంటి పదవులనూ ఆశించలేదు. తాను ఎంతో గర్వంగా, నిబద్ధతతో సేవ చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే తన శేష జీవితాన్ని గడపాలని ఆయన నిర్ణయించుకున్నారు.

1990వ దశకం ప్రారంభంలో ఆయన భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి కార్యదర్శిగా పదవీ విరమణ చేశారు. నక్సలైట్ ఉద్యమం అప్పుడే ఊపందుకుంటోంది. నక్సల్స్‌కు, పోలీసులకు మధ్య హింస, ప్రతిహింస ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. నక్సలైట్ ఉద్యమం మూలాలు మన సామాజిక వ్యవస్థలో ఉన్నాయని భావించే శంకరన్, దానికి రాజకీయపరమైన పరిష్కారం కనుగొనాలని, నక్సలైట్లు పేదలు, అభాగ్యుల ఆకాంక్షలకు ప్రతీకలని విశ్వసించేవారు. ఈ అచంచలమైన విశ్వాసంతో ఆయన తన జీవితంలో మరో ముఖ్యమైన ప్రయోగానికి పూనుకున్నారు. ఇది ఆయన జీవితంలో ఒక ముఖ్యమైన మలుపు తిప్పింది.

ఎంతో ప్రసిద్ధి చెందిన త్రిపుర ముఖ్యమంత్రి నృపేన్ చక్రవర్తి శంకరన్‌ను త్రిపురకు వచ్చి అక్కడ ప్రధాన కార్యదర్శి పదవిని చేపట్టమని విజ్ఞప్తి చేశారు. స్వభావంలో వీరిద్దరికీ ఎంతో సాపత్యం ఉంది. వీరిద్దరూ ఎంతో సాధారణ జీవితం గడిపేవారు. బ్రహ్మచారులు. అత్యంత నిజాయితీపరులు. తమకంటూ అతి తక్కువ వస్తువులను కలిగిన వారు. ఇద్దరూ తమ దుస్తులను స్వయంగా తామే ఉతుక్కునేవారు. ఇలా వారిద్దరూ ఒక ప్రత్యేకమైన భాగస్వామ్యంతో, ఆరేళ్లపాటూ రాష్ట్రాన్ని పరిపాలించారు. వారిద్దరి పాలనలో రాష్ట్రంలోని పేదలకు, అభాగ్యులకు అత్యంత నీతివంతమైన, సేవాపరమైన పరిపాలన లభించిందని చెప్పవచ్చు. గతంలో బీహార్‌లో ఉన్న, దక్షిణాది ప్రాంతాలకు చెందిన వారిని బలవంతంగా త్రిపురకు తెచ్చి, కాంట్రాక్టర్లు వారితో తక్కువ కూలీ ఇచ్చి పని చేయించుకునేవారు. వారు అమానవీయ పరిస్థితుల మధ్య జీవిస్తున్నారని తెలుసుకున్న శంకరన్ వారికి కనీస వేతనాలు లభించేలా చూసారు. వారికి పలు సదుపాయాలు కల్పించారు.

ఆంధ్రప్రదేశ్‌లోని అటవీ ప్రాంతంలో శంకరన్‌ను నక్సలైట్లు కిడ్నాప్ చేయడంతో ఆయన పేరు దేశవ్యాప్తంగా మార్మోగిపోయింది. ప్రభుత్వం నుంచి పదవీ విరమణ అనంతరం ఆయన ఒక పౌర కమిటీని ఏర్పాటు చేశారు. మావోయిస్టులతో జరుగుతున్న పోరులో పోలీసు బలగాలు మిలిటరీ తరహాలో మానవ హక్కులను హరిస్తున్నాయని ఆయన భావించేవారు. నక్సలైట్ల ఎన్‌కౌంటర్లను ఆయన చట్టాలను ఉల్లంఘించి చేస్తున్న హత్యలుగా పేర్కొన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లలో తమను చంపేస్తారని భయపడే అనేకమంది దళిత యువకులు, వారి బంధువులు శంకరన్‌ను కలిసి ఆయన సహాయాన్ని అర్థించేవారు. శంకరన్ జోక్యంతో అలా అనేక వందల మంది ప్రాణాలు నిలబడ్డాయి. గిరిజనులపై దశాబ్దాలుగా, ఇంకా చెప్పాలంటే తరతరాలుగా జరుగుతున్న అణచివేత, దోపిడీ, వారి భూములు, అడవుల నుంచి వారిని బయటకు తోలేయడంవల్లే దేశంలోని అడవుల్లో తిరుగుబాటు జరుగుతోందని శంకరన్ విసుగువిరామం లేకుండా ప్రభుత్వానికి గుర్తు చేసేవాడు.

అదే సమయంలో శంకరన్ మావోయిస్టుల హింసను ఖండించడంలో కూడా ఎన్నడూ వెనుకంజ వేసేవాడు కాదు. సామాజిక మార్పు కోసం ప్రజలను చైతన్యవంతులను చేయాల్సింది పోయి, మావోయిస్టులు ఎక్కువగా మిలటరీ చర్యలపై ఆధారపడుతున్నాడని ఆయన ఆరోపించేవారు. దీని వల్ల సమాజంలో మరింత హింస పేట్రేగిపోతోందనీ, దీని వల్ల సమాజంలో ఏ మార్పుల కోసమైతే మావోయిస్టులు పోరాడుతున్నారో, ప్రజలు వాటి కోసం పోరాడే స్వేచ్ఛ కోల్పోతున్నారనీ ఆయన ఆవేదన వ్యక్తం చేసేవారు. మావోయిస్టుల చర్యలతో ప్రజలను చైతన్యవంతులను చేయడానికి, ప్రజలు ప్రత్యక్షంగా పాల్గొనడానికి ఉన్న కొద్దిపాటి అవకాశాలు కూడా తగ్గిపోతున్నాయని ఆయన ఆరోపించేవారు.

ఆయన విశిష్టమైన నైతిక నిబద్ధత కారణంగానే ప్రభుత్వాలు, మావోయిస్టులు కూడా ఆయన విజ్ఞప్తులను మన్నించేవారు. తమ విధానాలపై ఆయనకు వివరణ ఇచ్చుకునేవారు. అయితే ఈ పోరాటంలో రెండు పక్కలా ఎవరూ తమ ముఖ్య విధానాలను మార్చుకోలేదన్నది వేరే సంగతి. ఈ ఘర్షణలో జరిగిన రక్తపాతంపై ఆయన ఎంతో వేదన చెందేవారు. సుమారు ఏడాదిపాటు ఈ కమిటీ ఆయన జీవితంలో ముఖ్యపాత్ర పోషించింది. ప్రజలను పరస్పర హింస నుంచీ బయట పడేయలేకపోయినందుకు, ప్రజల జీవితాల్లో శాంతిని నెలకొల్పలేకపోయినందుకు తాను మరణించేవరకూ ఆయన బాధపడ్డారు. సఫాయి కర్మచారి ఆందోళన్ కొరకు కూడా ఆయన తన జీవితంలో ఎక్కువ భాగాన్ని వెచ్చించారు. కొన్ని ప్రత్యేక కులాల వారు చేతులతో మానవ మలమూత్రాలను ఎత్తివేసే ఈ అమానవీయమైన వృత్తిని నిర్మూలించడానికి ఆయన విశేషంగా కృషి చేసారు. కులం, అంటరానితనం అత్యంత అమానవీయ రూపాలలో ఈ విధంగా బహిర్గతమవుతున్నాయని ఆయన విశ్వసించేవారు. ఒక దశాబ్దంపాటూ

శంకరన్ నిర్వహించిన ఈ ప్రచారం వల్ల దేశంలోని అనేక ప్రాంతాలలో ఈ దురాచారం నిర్మూలించబడింది. న్యాయవ్యవస్థ జోక్యం, ప్రభుత్వ అధికారులపై వత్తిడి, అహింసాత్మక రూపాలలో ఈ వృత్తిలో ఉన్న వాళ్ల ఆత్మగౌరవ పోరాటాలు, వీటిలో ఆయన పోషించిన ప్రధాన పాత్ర వల్ల మానవ మలాన్ని చేతులతో ఎత్తి వేసే మహిళల సంఖ్య 13 లక్షల నుంచి 3 లక్షలకు పడిపోయింది.

శంకరన్ తన జీతంలోనూ, పదవీ విరమణ అనంతరం వచ్చే పింఛన్‌లో కొంత భాగాన్ని దళిత విద్యార్థుల చదువుల కోసం పక్కన పెట్టేవారు. దీని గురించి ఆయన ఎన్నడూ ఇతరులకు చెప్పి ఉండలేదు. అయితే ఆయనకు మొట్టమొదటిసారిగా గుండెపోటు వచ్చినపుడు అనేక మంది దళిత యువకులు ఆయన సంరక్షణ కోసం పోటీ పడినప్పుడు ఇది వెల్లడైంది. అనేక మంది డాక్టర్లు, సివిల్ సర్జన్లు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు... తాము తమ జీవితంలో సాధించిన విజయాలు శంకరన్ వల్లనే సాధ్యమయ్యాయని చెప్పడం గమనార్హం. ఆయన పెళ్లి చేసుకోనప్పటికీ అనేక మంది ఆయనను తమ తండ్రిలా గౌరవించేవారు, ప్రేమించేవారు.

ఆయన ఎంతో నైతిక నిబద్ధత కలిగిన వ్యక్తి అయినప్పటికీ, ఎన్నడూ ఇతరుల విషయాల్లో తీర్పులివ్వడం కానీ, సందేశాలు ఇవ్వడం కానీ చేసేవారు కాదు. ప్రభుత్వ ఉద్యోగం నుంచి పదవీ విరమణ చేసాక ఆయన ఒక చిన్న, ఎలాంటి హంగులూ లేని అపార్ట్‌మెంట్‌లో నివసించేవారు. ఆయన అపార్ట్‌మెంట్‌ను చూస్తే ఆయన ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేసాడనుకుంటాం కానీ, ఆయన సీనియర్ ప్రభుత్వ ఉద్యోగి అని ఎవరూ నమ్మరు. ఆయన ఇంటిలో ఉన్న కొద్దిపాటు సామాన్లు, ఫర్నీచర్ కూడా ఎవరో ఒకరు ఆయనకు బలవంతంగా ఇచ్చినవే. పింఛన్ బకాయిలు వచ్చిన వెంటనే ఆయన వాటితో ఏం చేసుకోవాలో తోచక, వాటిని అనాథాశ్రమాలకు, వికలాంగుల సంస్థలకు ఇచ్చేసారు.

శంకరన్ సుప్రీంకోర్టు నియమించిన ఆహార భద్రత ప్యానెల్ (2003)కు కమిషనర్‌గా కూడా వ్యవహరించారు. సుప్రీంకోర్టు నియమించిన కమిషనర్‌గా ఆయన రాజ్యాంగపరంగా ప్రజలకు ఆహార భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని గట్టిగా వాదించేవారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి పేదలకున్న ఒకే ఒక ఉత్పత్తి కారకమైన ఆస్తి 'శ్రమ శక్తి' అని భావించారు. ఆహార హక్కు, పని హక్కు రెండూ కూడా ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయని, పని వల్లనే కొనుగోలు శక్తి వస్తుందని ఆయన వాదించేవారు. అందువల్ల మనిషి తిండి, ఇతర కనీస అవసరాలు తీర్చడం కోసం కనీస వేతనం ఇవ్వాలని రాజ్యాంగం చెబుతోందని ఆయన వాదించేవారు. ఈ విధంగా ఆయన వాదనలు NREGA ఏర్పాటుకు పరోక్షంగా దోహదపడ్డాయని భావించవచ్చు. పేద, ధనిక వర్గాల మధ్య ఘర్షణను సహృదయత కలిగిన ప్రభుత్వాల ద్వారా లేదా విప్లవాల ద్వారా పరిష్కరించవచ్చు. అయితే ఈ రెండు ప్రత్యామ్నాయాలు పరస్పర వ్యతిరేక శక్తులు. ప్రభుత్వమే ఈ సమస్య పరిష్కారానికి ముందుకు రావాలని శంకరన్ అభిప్రాయపడేవారు. అయితే ఇది అన్నిసార్లూ సాధ్యం కాదన్న విషయం గుర్తించిన వాస్తవవాది ఆయన. అందువల్ల అణచివేతకు వ్యతిరేకంగా ప్రజల తరపున పోరాటాలు చేస్తున్న విప్లవకారుల పట్ల ఆయన మౌనంగానే సానుభూతి వ్యక్తం చేసేవారు. సామాజిక కార్యకర్తలు, విప్లవకారులు, వారి విధానాలు, చేతలలోని పరిమితులను ఆయన గుర్తించేవారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పని చేయకుండా వారి విధానాలలోని లోటుపాట్లను నిర్మూలించడానికి ఆయన కృషి చేసేవారు. ఆ విధంగా ఆయన ఏదో ఒక పక్షం తీసుకోకుండా – ప్రభుత్వానికి, విప్లవకారుల తుపాకీ గొట్టానికి నడుమ మధ్యవర్తిగా పని చేశారని చెప్పవచ్చు.

ప్రణాళికా సంఘం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీలో సభ్యుడైన శంకరన్, కొన్ని ప్రత్యేకమైన సూచనలు చేసారు. వాటిలో కొన్నింటిని ఈ కింద ఇవ్వడం జరిగింది. వాటిని చూస్తే సమాజంలో అణగారిన వర్గాలు, నిర్లక్ష్యానికి గురైన వారి పట్ల ఆయన దృక్పథం ఎలా ఉండేదో మనం ఊహించవచ్చు.

దేశంలో అనేక షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన వర్గాలు ఉన్నాయి. వీటి కోసం అనేక సంస్థలు పని చేస్తున్నాయి. అవి **(అ).** షెడ్యూల్డ్ తెగలున్న రాష్ట్రాలలో గిరిజన సలహా మండలి **(ఆ.ఇ).** 338 ఆర్టికల్ కింద జాతీయ ఎస్సీ కమిషన్ మరియు జాతీయ ఎస్టీ కమిషన్ **(ఈ).** జాతీయ మానవ హక్కుల కమిషన్ **(ఉ).** జాతీయ మహిళా కమిషన్. **(ఊ).** జాతీయ బాలల హక్కుల కమిషన్ **(ఎ).** జాతీయ మైనారిటీ కమిషన్ **(ఏ).** జాతీయ సఫాయి కర్మచారి కమిషన్. అయితే వీటన్నిటి మధ్యా ఒక విస్తృత అవగాహన కానీ, ఒక సమగ్ర లక్ష్యం కానీ లేవు. ఈ కమిషన్లు ఇచ్చిన నివేదికలు కానీ, చేసిన ప్రతిపాదనలు కానీ, పరిశోధనలు కానీ వెలుగు చూడడం లేదు. వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ నిపుణుల కమిటీ ఆ కమిషన్‌లన్నీ కలిసి ఒకే దిశగా పని చేయాలనీ, అవన్నీ కలిసి సంయుక్త కార్యక్రమాలు చేపట్టాలనీ, వాటి ప్రతిపాదనలను అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులూ తప్పనిసరిగా పాటించాలని భావించడమైనది. వీటికి సహాయంగా రాష్ట్రాలలో కమిషన్లు ఉన్నాయి. దీనికి తోడు ఎస్సీ, ఎస్టీల కోసం పార్లమెంటరీ స్థాయీసంఘం కూడా ఉంది.

శంకరన్ చేసిన కృషి, ఆయన చేపట్టిన కార్యక్రమాల కారణంగా దేశంలోని లక్షలాది మంది అణగారిన వర్గాల ప్రజలు నేడు గౌరవ మర్యాదలతో జీవించగలుగుతున్నారు. ఆయన వల్ల అనేక మంది చట్టపరమైన హక్కులు లభించాయి. ప్రభుత్వంలోనూ, పదవీ విరమణ తర్వాత కూడా ఆయన చేసిన ప్రజా సేవ, ఆయన విశాల హృదయం, అతి సాధారణమైన ఆయన జీవన విధానం ఆయన మార్గాన వెళ్లాలనుకునే అనేక మంది మార్గదర్శకాలు. పట్టుదల కలిగిన ఆయన వ్యక్తిత్వం – భవిష్యత్ తరాలకు నిజమైన, విశ్వసనీయమైన మంచితనం ప్రజా జీవితంలో ఎలాంటి పనులను సాధించగలదో, ప్రపంచాన్ని ఇంతకన్నా మరింత మెరుగ్గా, మంచిగా, దయగలిగిన ప్రదేశంగా ఎలా మార్చగలదో చూపిస్తుంది. ✸